క్లుప్తంగా

మిత్రుడి కుటుంబానికి అండ



బాధితులకు సాయం అందిస్తున్న మిత్రులు

లోకేశ్వరం: మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన మినుగురుల శ్రీనివాస్ ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. లోకేశ్వరం ఉన్నత పాఠశాలలో 1999–2000లో శ్రీనివాస్‌తో కలిసి పదో తరగతి చదివిన అతడి మిత్రులు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం తలో కొంత జమ చేసి రూ.32 వేల నగదును బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో చిన్నారెడ్డి, అశోక్, రసూల్, నవీన్, రాజేశ్వర్, సంజీవ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

'పనిభారం మోపొద్దు'

లోకేశ్వరం: ఆశావర్కర్లపై అదనపు పనిభారం మోపొద్దని సోమవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్యసిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం చేపట్టే ఫైలేరియా, కుష్ఠు రోగుల వివరాలు సేకరించాలని తమను ఇబ్బంది పెట్టవద్దని కోరారు. ఆశా వర్కర్ల సంఘం మండలాధ్యక్షురాలు నందకుమారి, గోదావరి, సవిత, అర్చన, సాయమ్మ, హరిత, శారద, మంజుల ఉన్నారు.

ఆర్డీవో తనిఖీ

ముధోల్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సోమవారం ఆర్డీవో కోమల్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించారు. త్వరలో ఎన్నికలు జరుగనున్నందున కార్యాలయంలో రికార్డులను భద్రపర్చుకోవాలన్నారు. తహసీల్దార్ అతికొద్దీన్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

మామడ: సైబర్ నేరాల బారిన పడకుండా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రాజు అన్నారు. సోమవారం మండలంలోని కేజీబీవీలో సైబర్‌నేరాలు–అప్రమత్తత అనే అంశంపై అవగాహన కల్పించారు. ఫోన్లకు వచ్చే అవసరం లేని లింకులు ఓపెన్ చేయవద్దన్నారు. ఆన్‌లైన్ గేమ్‌లకు ఆకర్షితులవకుండా చదువుపై దృష్టి సారించాలన్నారు. ఇబ్బందులుంటే 100కు డయల్ చేయాలని సూచించారు. ఎస్‌వో జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నాభావుసాఠే జయంతి



వేడుకలో పాల్గొన్న ప్రజలు

ముధోల్: మండలంలోని బ్రాహ్మణ్‌గావ్ గ్రామంలో సోమవారం అన్నాభావుసాఠే జయంతి నిర్వహించారు. అన్నాభావుసాఠే ముధోల్ తాలూక కమిటీ అధ్యక్షుడు ఉత్తం బాలేరావు అంబేడ్కర్, అన్నాభావుసాఠే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఎస్‌సీ డైరెక్టర్ సుజిత్, పూజారి లక్ష్మణ్, సినిమా డైరెక్టర్ కొత్తూరి శంకర్, ఝరీ సాయినాథ్, అమృత్ ఆనంద్‌రావు తదితరులు ఉన్నారు.

'ప్రశ్నించిన వారిపై కేసులా'

ఖానాపూర్: ప్రజాసమస్యలపై ప్రశ్నించే వారిపై ఎమ్మెల్యే కేసులు నమోదు చేయిస్తూ.. భయబ్రాంతులకు గురి చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు మడిగెల గంగాధర్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతిభవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇంద్రవెల్లి మండలం డొంగర్‌గావ్‌లో హనుమాన్ విగ్రహం కళ్లను ఎమ్మెల్యే తీసుకెళ్లిన ఘటనలో గ్రామస్తులకు మద్దతుగా నిలిచిన వినోద్‌నాయక్‌పై పెట్టిన కేసు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, జహీర్, షారుఖాన్, వెంకటేశ్, రమేశ్, నరేశ్ తదితరులు ఉన్నారు.

కుంటాల తహసీల్దార్‌గా అహ్మద్‌ఖాన్



కుంటాల: కుంటాల తహసీల్దార్‌గా ఎజాజ్ అహ్మద్ ఖాన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేశారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ కలీం నిజామాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్లారు.

ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

నిర్మల్‌రూరల్: మండలంలోని మేడిపెల్లి గ్రామంలోని గణపతి ఆలయ పరిసరాల్లో సోమవారం నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ప్రోగ్రాం ఆఫీసర్లు నాగేశ్వర్, సరితారాణి విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు డాక్టర్ శంకర్, సిబ్బంది సత్యం తదితరులు ఉన్నారు.







'ఓపి'కకు పరీక్ష!

భైంసా ఏరియాస్పత్రికి వచ్చిన రోగులకు అధికారులు, సిబ్బంది 'ఓపీ'కకు పరీక్ష పెడుతున్నారు. రద్దీ పెరుగుతున్నా తగిన ఏర్పాట్లు లేకపోవడంతో ఓపీ కౌంటర్ వద్ద పేర్ల నమోదు మొదలు వైద్యులకు చూపించేందుకు ఓపీ గదుల వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. సోమవారం చంటిబిడ్డలతో మహిళలు భారీగా ఆస్పత్రికి వచ్చారు. చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ విజయానంద్ ఒక్కరే విధుల్లో ఉన్నారు. సరిపడా వైద్యులు లేకపోవడంపై తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేశారు. కొందరు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లిపోయారు. ఓపీ కౌంటర్ పెంచి వైద్యులను అదనంగా నియమించాలని కోరుతున్నారు. – భైంసాటౌన్



ప్రజావాణిలో హల్'సెల్'

కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం వస్తుంటారు. కానీ అర్జీలు స్వీకరించాల్సిన వివిధ శాఖల జిల్లా అధికారులు కలెక్టర్ ముందే తమకేం పట్టనట్లు సెల్‌ఫోన్‌లో నిమగ్నమయ్యారు. అధికారుల తీరుపై అర్జీదారులు విస్మయం వ్యక్తం చేశారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

చెరువులకు మరమ్మతులు చేయిస్తాం

• ముధోల్ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి

కుభీర్: ఇటీవల భారీ వర్షాలకు గండ్లు పడి దెబ్బతిన్న చెరువులకు మరమ్మతులు చేయిస్తామని ముధోల్ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కుభీర్, దొడర్నా, చొండి గ్రామాల్లో దెబ్బతిన్న పంటలతోపాటు కుభీర్‌లో తెగిపోయిన ఎల్లమ్మ చెరువుకట్ట పరిశీలించారు. చొండి గ్రామంలో దేవాదాయ శాఖ నిధులు రూ.45లక్షలతో నిర్మించే శివాలయానికి భూమిపూజ చేశారు. ప్రజలు ఐక్యంగా ఉండి తమ గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చవాన్ శంకర్, సర్పంచ్ చంద్రకాంత్, మీరా, వైస్ ఎంపీపీ మోహినొద్దీన్, ఎంపీటీసీ రమేశ్, బీఆర్‌ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూము రాజేశ్వర్, పీఏసీఎస్ చైర్మన్ గంగాచరణ్ తదితరులు ఉన్నారు.



కుభీర్: చెరువు కట్ట పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక..

ముధోల్: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసే పలువురు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాంటెక్‌లో 200 మంది ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం సాధించేలా కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఎంపీపీ అయేషా అఫ్రోజ్‌ఖాన్, జెడ్పీటీసీ సురేందర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ రవీందర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు మగ్దూమ్, సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షుడు విజేష్, ఎంపీటీసీ ఆత్మస్వరూప్, ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ మహిషాజీ, సర్పంచ్ విజయ్ తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులను కట్టడి చేద్దాం

తానూర్: సీజనల్ వ్యాధులను కట్టడి చేద్దామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఇద్రీస్‌గౌరీ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జనఆరోగ్య సమితి సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పీహెచ్‌సీలో సిబ్బంది తక్కువ ఉన్నా.. వైద్యసేవలు మెరుగ్గా అందుతున్నాయన్నారు. త్వరలోనే పూర్తిస్థాయి సిబ్బందిని నియమించి వసతులు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. కేంద్రంలో అత్యవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాజన్న, బీఆర్‌ఎస్ నాయకులు చంద్రకాంత్‌యాదవ్, గోవింద్‌పటేల్, ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ ఆకాశ్, వైద్యురాలు రమ్యాగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇద్రీస్‌గౌరీ

డ్రెయినేజీ పనులు ప్రారంభం

కుంటాల: మండలంలోని కల్లూర్ రెండో వార్డులో సోమవారం రూ.రెండు లక్షలతో డ్రెయినేజీ నిర్మాణ పనులను ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్ ప్రారంభించారు. మౌనిక, భోజన్న, జీవన్ తదితరులున్నారు.

సంక్షేమ పథకాలపై సమీక్ష

కుంటాల: మండలంలో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలపై కలెక్టర్ వరుణ్‌రెడ్డి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో అధికారులు ఉండి అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, డీటీ నరేశ్‌గౌడ్, ఏవో సోమలింగారెడ్డి, ఎంపీఓ రహీం, ఏపీవో నవీన్, అశోక్, కార్యదర్శులు పాల్గొన్నారు.

సన్మానం

సారంగాపూర్: ప్రభుత్వం నుంచి తమకు గొర్రెల యూనిట్లను పంపిణీ చేసినందుకు కృతజ్ఞతగా సోమవారం మండలంలోని వంజర్‌లో సర్పంచ్ లక్ష్మణ్, పశువైద్యాధికారి జమీల్‌ను గొల్ల, కుర్మ సంఘం నాయకులు సత్కరించారు. ఆత్మ డైరెక్టర్ మహేశ్‌యాదవ్, అశోక్‌యాదవ్, మధు, రాజు, వినోద్ తదితరులు ఉన్నారు.

సేవాభావం చాటిన భూమన్న

భైంసాటౌన్: పట్టణంలోని బోయిగల్లికి చెందిన చాకలి భూమన్న ఇస్త్రీ చేసుకుంటూ జీవనం సాగించడంతోపాటు తనకు చేతనైన సాయం చేస్తూ సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటాడు. సోమవారం భైంసాలోని వివేకానంద ఆవాసంలో ఉన్న సుమారు 30మందికిపైగా అనాథలైన విద్యార్థులకు స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా వారి యూనిఫాంలను ఉచితంగా ఇస్త్రీ చేసిచ్చాడు. భూమన్నను సామాజిక మాధ్యమాల వేదికగా పలువురు అభినందిస్తున్నారు.

హోంగార్డుల పూజలు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా హోంగార్డుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లాలోని ఆలయాలు, దర్గాలు, చర్చిల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. హోంగార్డులు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తమను పర్మినెంట్ చేస్తారనే నమ్మకంతో వారు, వారి కుటుంబం క్షేమంగా ఉండాలని పూజలు చేసినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ

లోకేశ్వరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం టై, బెల్టులను ప్రధానోపాధ్యాయుడు రమేశ్‌కుమార్ అందజేశారు. పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీ చైర్మన్ రమేశ్ కలసి తల కొంత జమ చేసి రూ.25 వేల విలువైన టై, బెల్టులను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు రమేశ్‌కుమార్, ఉపాధ్యాయులు భూమేశ్, కాశీరాం, నవీన్ ఉన్నారు.



టై,బెల్టులను అందిస్తున్న ఉపాధ్యాయులు

ఇంటింటా జెండా రెపరెపలాడాలి

కుంటాల: ఇంటింటా జాతీయజెండా రెపరెపలాడాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పవార్ రామారావు పటేల్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని లింబా(కే)ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి జాతీయజెండాలను ప్రదర్శించారు. అనంతరం పాఠశాలలో మొక్కలు నాటారు. ఎంపీపీ అప్క గజ్జారాంయాదవ్, ఎంపీటీసీ సుధాకర్, దిగంబర్ పటేల్, గజ్జారాం, సాయన్న, నరేశ్, రాజన్న, సాయిలు, రజాక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



జెండాలు ప్రదర్శిస్తున్న రామారావు పటేల్, నేతలు

నోట్‌బుక్‌లు, బ్యాగులు పంపిణీ

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీఎస్‌ఎస్‌లో చదువుతున్న 27 మంది పేద విద్యార్థులకు మంత్రి ఐకేరెడ్డి పీఏ కృష్ణంరాజు ఆధ్వర్యంలో రూ.10 వేల విలువైన నోట్‌బుక్‌లు, బ్యాగులు, పెన్నులు, తదితర సామగ్రిని పంపిణీ చేశారు. పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన దివాకర్‌కు ఇంటర్ చదివేందుకు రూ.16వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలాజీ, ఎంపీటీసీ పుప్పాల స్వప్న, పి.గజేందర్, ఎడ్ల రాజేశ్వర్, దూడ శ్రీనివాస్, బీసీ రమేశ్, భీమేశ్వర్, జనార్దన్, ఆడెపు రవి, రాజేందర్, రాజేశ్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.



విద్యార్థులకు నోట్‌బుక్‌లు అందిస్తున్న కృష్ణంరాజు

పంద్రాగస్టుకు ఏర్పాట్లు

తానూరు: స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యార్థులు తమ తరగతి గదులను శుభ్రం చేసుకుని మామిడి తోరణాలతో అలంకరించారు. ప్రధానోపాధ్యాయుడు సుభాశ్ సమలే, ఉపాధ్యాయులు ఉన్నారు.

రాయితీ సద్వినియోగం చేసుకోండి

భైంసాటౌన్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 15న ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వృద్ధులకు టికెట్‌పై 50శాతం రాయితీ అందించనున్నట్లు డీఎం అమృత తెలిపారు. 60 ఏళ్లు దాటిన వారు ఆధార్‌ను కండక్టర్‌కు చూపి సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అఖండ భారత్ సంకల్ప్ దివస్

ఖానాపూర్: అఖండ భారత్ సంకల్ప్ దివస్ సోమవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తా నుంచి జగన్నాథ్‌రావు చౌరస్తా వరకు కాగడాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భజరంగ్‌దల్ జిల్లా సంయోజక్ కాశవేని ప్రణయ్ మాట్లాడారు. వీరుల త్యాగాలు, పోరాటాల ఫలితంగానే 14 అగస్టు 1947 రోజున బానిసత్వాన్ని వదిలించుకొని స్వాతంత్ర్యం సాధించుకున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గోరక్షక్ ప్రముఖ్ జెట్టి వెంకటేశ్, సిద్దు, సాయి, శివ, శ్రీను, సాగర్, జోగు రాజేశ్వర్, సురేశ్, నవీన్, తదితరులు ఉన్నారు.

కుభీర్: మండల కేంద్రంలో హిందువాహిని ఆధ్వర్యంలో సోమవారం అఖండ భారత సంకల్ప్ దివాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా హిందువాహిని జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో హిందువాహిని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ

నిర్మల్: జాతీయస్థాయి ఎస్‌ఓఎఫ్ మ్యాథ్స్, సైన్స్ ఒలంపియాడ్‌లో జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. అత్యధిక బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలు సాధించారు. ఈమేరకు సోమవారం వారిని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి అభినందించారు. విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే మ్యాథ్స్, సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలన్నారు. పోటీ పరీక్షల్లో పాల్గొంటే ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. పాఠశాలకు చెందిన విశ్వజిత్(5వ), ముస్తాఫా, వీరేన్, కీర్తివ్యాస్(4వ), రిషిత(3వ), కనిక(5వ), షోఫియాజరీన్(3వ), అథర్వ(5వ) బంగారు పతకాలు సాధించారు. కార్యక్రమంలో దీక్ష కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి, స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

గిరివికాస్ పథకం వర్తింపజేయాలి

లోకేశ్వరం: మండలంలోని నాయక్‌పోడ్(ఎస్టీ) కులస్తులకు గిరి వికాస్ పథకం వర్తింపజేయాలని నాయక్‌పోడ్ సంఘం కమిటీ సభ్యులు సోమవారం ఉట్నూర్‌లోని ఐటీడీఏ కార్యాలయంలో పీవో చాహత్ బాజ్‌పాయ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరివికాస్ పథకం కింద బోర్లు, మోటార్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయక్‌పోడ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సంగెం నర్సన్న, లోకేశ్వరం మండలాధ్యక్షుడు గంగాధర్, మండల కమిటీ సభ్యులు లక్ష్మణ్, నిమ్మ శివన్న, రాజుల లక్ష్మణ్, భోజన్న, నారాయణ, భూమేశ్, సాయన్న ఉన్నారు.



పీవోకు వినతిపత్రం ఇస్తున్న కమిటీ సభ్యులు

బీజేపీలో పలువురు చేరిక

సారంగపూర్: మండలంలోని ధని గ్రామ సర్పంచ్ ఒలికెరి లక్ష్మిచిన్నయ్యతో పాటు పలువురు గ్రామస్తులు, యూత్ సభ్యులు బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వారికి బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలో నిర్మల్ నియోజకవర్గంలోని వివిధ వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు బీజేపీలో చేరతారన్నారు. కార్యక్రమంలో రావుల రాంనాథ్, రాజు, రాజేశ్వర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు కరిపె విలాస్, రాంశంకర్‌రెడ్డి, వీరయ్య, చాణక్య, మధు తదితరులు ఉన్నారు.



పార్టీలో చేరిన వారితో మహేశ్వర్‌రెడ్డి

అర్హులకు సాయం అందించండి

నిర్మల్‌రూరల్: ప్రభుత్వం బీసీకులవృత్తుల వారికి అందించే రూ.లక్ష రుణ సాయాన్ని అర్హులందరికీ వర్తింపజేయాలని వెంగవాపేట్ గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరారు. ఎంపీటీసీ దూరీకి సాయన్న, సర్పంచ్ గంగన్న ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సాయిరాంకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.. గ్రామంలో 32 మంది బీసీ రుణం కోసం దరఖాస్తు చేసుకోగా కేవలం 13 మందినే అర్హులుగా గుర్తించారన్నారు. క్షేత్రస్థాయిలో వివరాలు తెలుసుకోకుండా పంచాయతీ సెక్రెటరీ తప్పుడు నివేదిక ఇచ్చారన్నారు. మొదటి జాబితా సిద్ధం చేశామని.. రెండో జాబితాలో అర్హులందరికీ న్యాయం చేస్తామని ఎంపీడీవో పేర్కొన్నా.. సంతప్తి చెందని గ్రామస్తులు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి దృష్టికి తమ సమస్య తీసుకెళ్తామని వెళ్లిపోయారు.

'అనర్హులు ఇళ్లు వదిలిపెట్టాలి'

ఖానాపూర్: పట్టణంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లు పొందిన అనర్హులు వెంటనే ఇళ్లు వదిలి వెళ్లాలని సీపీఐఎంఎల్ (ప్రజాపంథా) జిల్లా కార్యదర్శి నంది రామయ్య డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని డబుల్ బెడ్‌రూం కాలనీలో బాధిత పేదలతోపాటు ఇళ్లు పొందిన వారితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అనర్హులను ఎంపిక చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అధికారుల నిర్లక్ష్యంతోనే ఇళ్ల పంపిణీ ప్రక్రియ గందరగోళానికి దారి తీసిందని వారు పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నందిరామయ్య

బాధిత కుటుంబాలకు పరామర్శ

లక్ష్మణచాంద: మండలంలోని పలు బాధిత కుటుంబాలను సోమవారం డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన గూండ్ల పోషన్న అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని శ్రీహరిరావు పరామర్శించి రూ.పది వేల సాయం అందించారు. లక్ష్మణచాందకు చెందిన షేక్, చామస్‌పెల్లికి చెందిన గంగమల్లు కుటుంబాలను పరామర్శించి రూ.5వేల చొప్పున సాయం అందించారు. పార్‌పెల్లికి చెందిన ముత్తన్న, రాధ కుటుంబాలను పరామర్శించి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, రాజేశ్వర్, ఈటెల శ్రీనివాస్, రవి, రజినీకాంత్ తదితరులు ఉన్నారు.



లక్ష్మణచాందలో పరామర్శిస్తున్న శ్రీహరిరావు

విద్యార్థిని చితకబాదిన ప్రిన్సిపాల్

భైంసాటౌన్: భైంసా పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థి దేవేందర్‌ను ప్రిన్సిపాల్ చితకబాదాడు. విద్యార్థి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విద్యార్థి తండ్రి గణేశ్ కథనం ప్రకారం.. పాఠశాలలో తన కొడుకు, మరో విద్యార్థి మధ్య సోమవారం చిన్నపాటి తగాదా తలెత్తడంతో గొడవపడ్డారు. గమనించిన ప్రిన్సిపాల్ దేవేందర్‌ను కర్రతో కొట్టాడు. దీంతో తన కొడుకును చితకబాదిన ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

అక్రమ పట్టా రద్దు చేయాలి

సోన్: మండలంలోని కడ్తాల్ గ్రామ పెద్ద చెరువు శిఖం భూమిని అక్రమంగా పట్టా చేసుకున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డికి కడ్తాల్ వీడీసీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కొందరు నకిలీ పట్టాలు సృష్టించి చెరువు శిఖం భూమిని ఆక్రమించుకున్నారని.. విచారణ జరిపి పట్టా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

పనులు పరిశీలన

కుంటాల: మనఊరు– మనబడిలో భాగంగా మండలంలోని లింబా(కే) ఉన్నత పాఠశాలలో రూ.23 లక్షల 23వేలతో జరుగుతున్న డైనింగ్‌హాల్ నిర్మాణ పనులను ఎంపీపీ గజ్జారాం యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు సక్రమంగా జరిగేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. వారి వెంట హెచ్‌ఎం సతీష్‌కుమార్, ఎంపీటీసీ సుధాకర్, సాయన్న, గజ్జారాం, సాయిలు, గోవింద్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.